రివ్యూలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

# నిమజ్జనం సజావుగా సాగాలి

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్

మానకొండూర్, సెప్టెంబర్ 15: మానకొండూర్ పెద్దచెరువులో సోమవారం నిర్వహించే గణేశుడి నిమజ్జన కార్యక్రమం సజావుగా సాగాలని బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. నిమజ్జనం సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లపై స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి వివిధ శాఖల అధికారులతో ఆదివారం మానకొండూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. చెరువుకట్ట వద్ద చేసిన ఏర్పాట్లను సంబంధిత శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా గణేశుడి నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా జరుగాలని, దీనికి అన్నిశాఖల అధికారులు సమన్వయంతో కలిసికట్టుగా పనిచేయాలని అదేశించారు.

కరీంనగర్‌లోని టవర్‌సర్కిల్ వద్ద తొలి వినాయకుడి ఊరేగింపు 6 గంటలకు ప్రారంభమవుతుందని, సకాలంలో ఊరేగింపు ప్రారంభించాలని నిర్వాహకులను కోరారు. కరీంనగర్-వరంగల్ రహదారిపై వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. నిమజ్జనానికి వచ్చే వాహనాలకు పార్కింగ్ స్థలం కేటాయించాలని, భక్తులకు, విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బందికి భోజన సౌకర్యం కల్పించాలని సూచించారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, నిమజ్జనం పూర్తయ్యే వరకు అధికారులంతా అందుబాటులో ఉండాలని, అవసరమైతే షిఫ్టుల వారీగా విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ సమేలా సత్పతి, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్లు ప్రఫుల్‌దేశాయ్, లక్ష్మీకిరణ్, ఆర్డీవో మహేశ్వర్, డీఎం అండ్‌హెచ్‌వో సుజాత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఇందుర్తిలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ నేత చాడ వెంకటరెడ్డి

# అమరుల ఆశయ సాధనకు సిద్ధం కావాలి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

చిగురుమామిడి, సెప్టెంబర్ 15: ప్రజా సమస్యలపై చేపట్టిన పోరాటాల్లో అమరవీరులైన వారి త్యాగాలు వృథా కావని, వారి ఆశయాలు, లక్ష్యాలను ముందుకు తీసుకువెళ్లేందుకు నేటి తరం కమ్యూనిస్టులు సిద్ధం కావాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా చిగురుమామిడి మండలం ఇందుర్తి, ఓగులాపూర్, గాగిరెడ్డిపల్లె, చిగురుమామిడి, రేకొండ, బొమ్మనపల్లి గ్రామాలకు చెందిన అమరవీరుల స్మారక స్తూపాల వద్ద ఆదివారం సీపీఐ నేతలతో కలిసి చాడ వెంకటరెడ్డి నివాళులర్పించారు. ఆయా చోట్ల సీపీఐ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం మొదలు నేటికీ ప్రజా సమస్యలపై సీపీఐ నిత్యం పోరాడుతున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె స్వామి, బోయిని అశోక్, గూడెం లక్ష్మి, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మీరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# నిమజ్జనోత్సవానికి నిరంతర విద్యుత్

- అదనంగా ఐదు 100కేవీ ట్రాన్స్ ఫార్మర్లు కేటాయింపు
- సర్కిల్ కార్యాలయంలో సిద్ధంగా మరో మొబైల్ ట్రాన్స్ ఫార్మర్
- డీఈ, ఏడీఈలకు కేంద్రాల పర్యవేక్షణ బాధ్యతలు

కొత్తపల్లి చెరువు వద్ద విద్యుత్ సరఫరా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్ఈ గంగాధర్, డీఈలు, ఏడీఈలు

ముకరంపుర, సెప్టెంబర్ 15: జిల్లాలో పలు ప్రాంతాల్లో సోమవారం నిర్వహించే వినాయక నిమజ్జనోత్సవానికి విద్యుత్ శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ప్రధానంగా మానకొండూర్ చెరువులో, కరీంనగర్-వేములవాడ ప్రధాన రహదారిలోని చింతకుంట కాకతీయ ప్రధాన కాల్వ వద్ద, కొత్తపల్లి పట్టణంలోని ఊర చెరువులో నిమజ్జన కేంద్రాల వద్ద అంతరాయం లేని విద్యుత్ సరఫరా కోసం ఆదివారం సాయంత్రం వరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సాంకేతికంగా ఏదైనా సమస్య తలెత్తితే సరఫరాకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. అదనంగా ఐదు 100కేవీ ట్రాన్స్ ఫార్మర్లతో పాటు మరొక మొబైల్ ట్రాన్స్ ఫార్మర్ అందుబాటులో ఉంచారు.

## అధికారులకు పర్యవేక్షణ బాధ్యతలు

నిమజ్జనం పూర్తయ్యేంతవరకు విద్యుత్ సరఫరా విషయంలో ఏ సమస్య తలెత్తకుండా ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ డీఈలు, ఏడీఈలకు నిరంతర పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. కొత్తపల్లి కేంద్రం వద్ద కరీంనగర్ రూరల్ ఏడీఈ కే రాజు, టవర్ సర్కిల్ పాయింట్ వద్ద కరీంనగర్ టౌన్-1, 2 ఏడీఈలు నరేందర్, సుధీర్ కుమార్, చింతకుంట కేంద్రం వద్ద కరీంనగర్ టౌన్ డీఈ రాజం, మానకొండూర్ వద్ద కన్స్ట్రక్షన్ డీఈ చంద్రమౌళి, జమ్మికుంట కేంద్రం వద్ద ఏడీఈ రాజేందర్ రెడ్డి, హుజూరాబాద్ వద్ద డీఈ లక్ష్మిరెడ్డి బాధ్యతలు అప్పగించినట్లు ఎస్ఈ తెలిపారు. శోభాయాత్రలో ఎక్కడైనా విద్యుత్ లైన్లు అడ్డుగా వస్తే నిర్వాహకులు అక్కడి విద్యుత్ సిబ్బంది లేదా అధికారులకు సమాచారం అందించాలని, వాటిని తప్పించే ప్రయత్నాలు చేయవద్దని కోరారు. అడ్డుగా ఉన్న డిష్, ఇంటర్నెట్ కేబుళ్లు తొలగించాలని నిర్వాహకులకు సూచించినట్లు ఎస్ఈ తెలిపారు.

# గండిని పూడ్చిన రైతులు

ఇల్లందకుంట సెప్టెంబర్ 15 : ఇల్లందకుంట మండలంలోని వాగొడ్డురామన్నపల్లి, మల్యాల, కనగర్తి, లక్ష్మాజీపల్లి గ్రామాల రైతులకు సాగు నీరందించే వెంకటేశ్వర నాలా వర్షాలకు గండి పడిపోగా రైతులే శ్రమదానం చేసి పూడ్చి వేశారు. వాగొడ్డురామన్నపల్లి వద్ద గతంలో స్థానిక వాగుపై వెంకటేశ్వరనాలా నిర్మించారు. దీని కింద 5 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. అయితే, ఇటీవలి వర్షాలకు నాలాకు గండి పడింది. దీంతో ఆయకట్టు కింద నీరు లేక పొలాలు ఎండిపోవడంతో రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారు పట్టించుకోకపోవడంతో పంటలను బతికించుకోవడానికి మూడు గ్రామాలకు చెందిన 50 మంది రైతులు శ్రమదానం చేసి తాత్కాలికంగా గండిని పూడ్చి వేశారు.

# గురుకులం ఎదుట ఆందోళన

గన్నేరువరం, సెప్టెంబర్15 : విద్యార్థులకు వడ్డించే అన్నంలో పురుగులు వస్తున్నాయని గన్నేరువరం మండలంలోని గుండ్లపల్లి స్టేజీ వద్ద గల మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాల ఎదుట సీపీఐ నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఆదివారం ఆందోళనకు దిగారు. 400 మంది బాలికలు ఉన్న పాఠశాలలో సమస్యలు పట్టించుకోకుండా అధికారులు ఏం చేస్తున్నారని సీపీఐ మండల సహాయ కార్యదర్శి చుక్కల్ల శ్రీశైలం ప్రశ్నించారు. ఇప్పటికే డెంగ్యూ, మలేరియా వంటి విష జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారని, పురుగుల అన్నం తింటే తమ పిల్లల ఆరోగ్యం ఎలా ఉంటుందని వారి తల్లిదండ్రులు మండిపడ్డారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు అధ్వానంగా ఉన్నాయని తెలిపారు. సమస్యలు చూసేందుకు పాఠశాలలోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తే సిబ్బంది రానివ్వడం లేదని అన్నారు. రెండు నెలల కిందట ఎమ్మెల్యే ఈ పాఠశాలను తనిఖీ చేసిన సమయంలో డ్రైనేజీ వ్యవస్థ, సమస్యలపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారని, అయినా పరిస్థితుల్లో మార్పులు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, ఈ ఘటనపై ప్రిన్సిపాల్ నవీనను సంప్రదించగా, ప్రతి రోజూ కూరగాయలు, బియ్యం శుభ్రం చేసిన తర్వాతే వంటలు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, పొరపాటున అన్నంలో పురుగు వచ్చి ఉంటుందని పేర్కొన్నారు.

# ఎస్ఐని దించి వస్తానని..

బైక్‌తో ఉడాయించిన వ్యక్తి

కరీంనగర్‌లోని శాస్త్రీరోడ్‌లో ఘటన

కరీంనగర్ రాంనగర్, సెప్టెంబర్ 15 : కానిస్టేబుల్ తరహా దుస్తులు దరించిన ఓ వ్యక్తి రోడ్డుపై విధులు నిర్వర్తిస్తున్నట్టు నటించి.. అటుగా వచ్చిన యువకుడిని ఆపి ఎస్ఐని దించి వస్తానని బైక్‌తో సహా ఉడాయించాడు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని శాస్త్రీరోడ్‌లో ఆదివారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి బాధితుడి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని ఫతేపురకు చెందిన బొజ్జ శివమ్ తన బుల్లెట్ వాహనంపై శాస్త్రీ రోడ్డుపై వస్తుండగా అక్కడే కానిస్టేబుల్ తరహా దుస్తుల్లో విధి నిర్వహణలో ఉన్నట్టుగా నటించిన వ్యక్తి వాహనాన్ని ఆపాడు. సమీపంలో తమ ట్రాఫిక్ ఎస్ఐ విధులు నిర్వర్తిస్తున్నాడని, అతడిని దించి వస్తానని, బైక్ ఇవ్వాలని అడిగాడు. పోలీస్ యూనిఫాంలో ఉండడంతో ఆ వ్యక్తిని నమ్మిన శివమ్ తన బుల్లెట్ వాహనాన్ని ఇచ్చాడు. ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చి హుటాహుటిన ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి వివరాలు చెప్పాడు. దీనిపై ట్రాఫిక్ పోలీసులు తమ కానిస్టేబుల్ ఎవరూ అక్కడ విధినిర్వహణలో లేరని చెప్పడంతో వెంటనే వన్‌టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. పోలీస్ యూనిఫాంలో వచ్చిన వ్యక్తి తన బైక్ ఎత్తుకెళ్లాడని లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సరిలాల్ తెలిపారు.

విద్యుత్‌శాఖ సిబ్బందితో గ్రామ ప్రజలు

# ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

నమస్తే ఎఫెక్ట్

రామడుగు, సెప్టెంబర్15 : మండలంలోని గోపాల్‌రావుపేట ఎయిర్‌టెల్ టవర్ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోగా, ఈ సమస్యపై 'నమస్తే తెలంగాణ'లో 'మళ్లీ కరెంటు కష్టాలు!' అనే శీర్షికన శనివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గంగాధర ఏడీఈ సత్యనారాయణరెడ్డి, గుండి ఏఈ కమలేశ్ విద్యుత్ సిబ్బందితో కలిసి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. గతంలో 60 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఉండేదని, ప్రస్తుతం 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

కళోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

# 'నవోదయ'లో కళోత్సవాలు ప్రారంభం

చొప్పదండి, సెప్టెంబర్ 15: నవోదయ విద్యాలయ సమితి ఆదేశాల మేరకు చొప్పదండి జవహర్ నవోదయ విద్యాలయంలో కళోత్సవాలను ఎస్‌యూ రిటైర్డ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ దాస్యం సేనాధిపతి, విద్యాలయ ప్రిన్సిపాల్ మంగతాయారు ఆదివారం ప్రారంభించారు. రెండు రోజుల పాటు కొనసాగే ఈ ఉత్సవాల్లో తెలంగాణలోని తొమ్మిది నవోదయ విద్యాలయాల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా దాస్యం సేనాధిపతి మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ రాణించాలని సూచించారు. ఈ ఉత్సవంలో భాగంగా ఆదిలాబాద్, రంగారెడ్డి, మెదక్, వరంగల్ జిల్లాలకు చెందిన నవోదయ విద్యాలయాల విద్యార్థులు పాటలు, నృత్యాలు, చిత్రలేఖన పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చూపారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా ప్రొఫెసర్ శర్మ, బాల భవన్ సూపరింటెండెంట్ కట్టు మంజుల, థియేటర్ ఆర్టిస్టులు సత్యనారాయణ, సంగం రాధాకృష్ణ వ్యవహరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బంగారమే శ్రీరామరక్ష!

**ఆపత్కాలంలో** ఆదుకునేది బంగారం మాత్రమే. సమయానికి చేతిలో చిల్లిగవ్వ లేనప్పుడు ఈ పుత్తడే మీకు పరమాన్నంగా మారుతున్నది. ఆరోగ్యం బాగోలేక ఆసుపత్రి పాలైనప్పుడు ఈ గోల్డే మీకు ఆర్థికంగా ఆదుకుంటుంది. ఆర్థిక సంక్షోభం చుట్టుముట్టినప్పుడు బంగారమే శ్రీరామరక్ష. సామాన్యుడి నుంచి మొదలుకొని సంపన్నవర్గాలు కూడా ప్రతియేటా బంగారం ఎంతో కొంత కొనుగోలు చేస్తున్నారు. అక్కరకు వచ్చినప్పుడు ఈ గోల్డ్‌ను తాకట్టుపెట్టుకొని రుణాలు తీసుకుంటున్నారు. వీటి కోసం బ్యాంకులతోపాటు ఆర్థిక సేవల సంస్థలు ప్రత్యేకంగా పసిడిపై రుణాలు మంజూరు చేస్తున్నాయి. సెక్యూర్డ్ రుణాలు కావడంతో బంగారం విలువలో 80 శాతం వరకు రుణాలు మంజూరు చేస్తున్నాయి బ్యాంకులు, ఆర్థిక సేవల సంస్థలు. బంగారం కడ్డీలతోపాటు ఆభరణాలు తాకట్టుపెట్టుకొని కేవలం కొన్ని నిమిషాల్లోనే రుణం పొందవచ్చును. వ్యక్తిగత రుణాలు, ఇతర రుణాలు తీసుకోవాలంటే రోజుల సమయం పడుతుంది కానీ, బంగారంపై రుణాలు తీసుకోవడం ఎంతో సులభం. పెద్దగా డాక్యుమెంట్లు లేకుండానే తీసుకోవచ్చును. తక్కువ వడ్డీకే రుణాలు తీసుకోవచ్చును. ఏయే బ్యాంకుల్లో ఎంత వడ్డీని ఆఫర్ చేస్తున్నాయి. ప్రభుత్వరంగ బ్యాంకులతోపాటు ప్రైవేట్ రంగ బ్యాంకులు 8 శాతం మొదలు కొని 24 శాతం వరకు వడ్డీని ఆఫర్ చేస్తున్నాయి. తీసుకున్న రుణాలను ఏడాదిలోగా చెల్లించాల్సి ఉంటుంది. లేకపోతే బ్యాంకులు తాకట్టు కింద పెట్టిన ఆభరణాలను జప్తు చేసుకొని వేలం వేసుకునే అధికారం ఉంటుంది. పసిడి విలువను గుర్తించడంలో ఒక్కో బ్యాంకుది ఒక్కో తీరుగా ఉంటుంది.

**క్రెడిట్ స్కోర్ అక్కర్లేదు..**

సిబిల్ స్కోర్ లేకుండానే బంగారంపై రుణాలు తీసుకోవచ్చును. కేవలం బంగారం లేదా ఆభరణాలు తాకట్టు పెట్టుకొని రుణాలు తీసుకోవచ్చును. దీనికోసం వారి క్రెడిట్ స్కోర్ ఎంత ఉన్నదో అవసరం లేదు. 500 లోపు సిబిలి స్కోర్ ఉన్నవారు కూడా సులువుగా రుణాలు తీసుకోవచ్చును.

**కావాల్సిన డాక్యుమెంట్లు**

బంగారం తాకట్టుపై రుణాలు తీసుకోవడానికి పలు డాక్యుమెంట్లు అవసరం ఉంటాయి. వీటిలో ఆధార్ కార్డుతోపాటు పాన్ కార్డు, బ్యాంక్ ఖాతాతోపాటు కేవైసీ డాక్యుమెంట్ సమర్పించాల్సి ఉంటుంది. మనం తీసుకునే బ్యాంకులోనే ఖాతా ఉండాల్సి ఉంటుంది. ఇటీవలకాలంలో బ్యాంకులతోపాటు పసిడిపై రుణాలు ఎన్‌బీఎఫ్‌సీలు కూడా ఇస్తున్నాయి.

**పసిడి రుణాలపై ఏయే బ్యాంకుల్లో ఎంత వడ్డీ**

| బ్యాంక్ | వడ్డీరేటు(శాతంలో) | ప్రాసెసింగ్ ఫీజు |
|---|---|---|
| కొటక్ మహీంద్రా | 8 నుంచి 24 వరకు | 2 శాతం+జీఎస్టీ |
| హెచ్‌డీఎఫ్‌సీ | 8.30 నుంచి 16.55 వరకు | ఒక్క శాతం |
| సెంట్రల్ బ్యాంక్ | 8.40 నుంచి 9.25 వరకు | రుణంపై అరశాతం |
| యూకో | 8.50 | రూ.250-5 వేల వరకు |
| ఇండియన్ బ్యాంక్ | 8.80 నుంచి 9 వరకు | రుణంపై 0.56 శాతం |
| యూనియన్ బ్యాంక్ | 8.65 నుంచి 9.90 వరకు | - |
| ఎస్బీఐ | 8.70 | అర శాతం+జీఎస్టీ |
| ఇండస్‌ఇండ్ | 8.75 నుంచి 16 వరకు | రుణంపై ఒక్క శాతం |
| బంధన్ బ్యాంక్ | 8.75 నుంచి 19.25 వరకు | ఒక్క శాతం+జీఎస్టీ |
| బ్యాంక్ ఆఫ్ బరోడా | 9.15 | వర్తించే చార్జిలు+జీఎస్టీ |
| పంజాబ్ నేషనల్ | 9.25 | రుణంపై 0.75 శాతం |
| బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర | 9.30 | రూ.500-2,000+జీఎస్టీ |
| ఫెడరల్ బ్యాంక్ | 9.49 | - |
| కెనరా బ్యాంక్ | 9.60 | రూ.500-5 వేల వరకు |
| ఐసీఐసీఐ బ్యాంక్ | 10 | రుణంపై ఒక్క శాతం |

**తిరిగి చెల్లింపులు ఎలా..**

బంగారంపై తాకట్టుపై రుణాలు తీసుకున్న వారు మూడు రకాలుగా తిరిగి చెల్లింపులు జరుపుకునే అవకాశాలను బ్యాంకులు కల్పించాయి. వీటిలో నెలవారి చెల్లింపుల రూపంలో చెల్లింపులు జరుపుకోవచ్చును, లేదా మూడు నెలల్లో వడ్డీతో సహా తీసుకున్న రుణాన్ని చెల్లించవచ్చును. అలాగే ఆరు నెలలు, ఏడాది కాల పరిమితితో తీసుకున్న రుణాలను వడ్డీతో కలుపుకొని చెల్లించుకోవచ్చును. ఒకవేళ ఏడాది ముగిసిన తర్వాత తీసుకున్న రుణానికి వడ్డీని చెల్లించి మళ్లీ రెన్యూవల్ చేసుకోవచ్చు.

# కొత్త పీపీఎఫ్ రూల్స్

**అక్టోబర్ 1 నుంచి అమల్లోకి..**

**పబ్లిక్** ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్) ఖాతాలను మైనర్ల కోసం కూడా తెరుచుకోవచ్చు. మారిన నిబంధనల ప్రకారం సదరు మైనర్లకు 18 ఏండ్లు నిండేదాకా ఈ ఖాతాలు పోస్టాఫీస్ సేవింగ్స్ అకౌంట్ వడ్డీ రేటుతో కొనసాగుతాయి. మైనార్టీ తీరిన తర్వాత పీపీఎఫ్ ఖాతాగా మార్చుకోవచ్చు. ఈ మేరకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఇక ఒకటికి మించి పీపీఎఫ్ ఖాతాలనూ తెరుచుకోవచ్చు. అలాగే ప్రవాస భారతీయులు (ఎన్నారైలు) పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ స్కీం (పీపీఎఫ్) 1968 కింద క్రియాశీల పీపీఎఫ్ ఖాతాలను తెరిస్తే ఫామ్ హెచ్ ద్వారా ఖాతాదారుని నివాస హోదా గురించి అడగకపోతే పోస్టాఫీస్ సేవింగ్స్ అకౌంట్ మార్గదర్శకాల ప్రకారం ఈ నెలాఖరుదాకా ఉండే వడ్డీరేట్లు వర్తిస్తాయి. పీపీఎఫ్ అనేది కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సాధనం. అంతేగాక మదుపరులను దీర్ఘకాలిక ఆకర్షణీయ ప్రయోజనాలతో కూడిన సేవింగ్స్, పెట్టుబడులకు ప్రోత్సహించే పథకం ఇది. దీనికి ఆదాయ పన్ను (ఐటీ) మినహాయింపులూ వర్తిస్తాయి.

# షార్ట్-టర్మ్ ఆరోగ్య బీమా

## లాభాలు, పరిమితులు తెలుసా?

**షార్ట్-టర్మ్** ఆరోగ్య బీమా తాత్కాలిక కవరేజీని కల్పిస్తుంది. దీన్నే టర్మ్ మెడికల్ ఇన్సూరెన్స్ అని కూడా పిలుస్తారు. సాధారణంగా ఇది కొద్ది నెలల నుంచి ఏడాదిదాకే ఉంటుంది. ఎవరైతే స్టాండర్డ్ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలతో వచ్చే దీర్ఘకాలిక ఆరోగ్య బీమాలు కాకుండా తక్షణ కవరేజీలను కోరుకుంటారో వారినుద్దేశించినదే ఈ పాలసీ. సమగ్ర కవరేజీని కొనలేనివారికి కూడా ఇది ఉపయుక్తంగా ఉంటుంది. కంపెనీల్లో గ్రూప్ ఇన్సూరెన్స్ కోసం వేచిచూస్తున్న ఉద్యోగులు, నిరుద్యోగులకు దీని అవసరం ఎక్కువని చెప్పవచ్చు.

**షార్ట్-టర్మ్ హెల్త్ ఇన్సూరెన్స్ శైలి**

- కేవలం కొద్ది నెలల నుంచి ఏడాది వరకే బీమా కవరేజీ.
- లాంగ్-టర్మ్ ప్లాన్లతో పోల్చితే షార్ట్-టర్మ్ ప్లాన్లకు ప్రీమియంలు తక్కువే.
- ఇప్పటికే ఉన్న ఆరోగ్య సమస్యలకు బీమా కవరేజీ ఉండకపోవచ్చు. కొన్ని రకాల చికిత్సలకూ వీలుండదు.
- కనీస ఆరోగ్య సమాచారంతో ఈ ప్లాన్లను తీసుకోవచ్చు.
- పరిమిత స్థాయిలోనే ఈ ప్లాన్ల చెల్లుబాటు ఉంటుంది. ఎంపిక చేసిన నెట్‌వర్క్‌లో తప్ప.. అన్ని దవాఖానల్లో చెల్లవు.
- లాంగ్-టర్మ్ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలను రెన్యువల్ చేసుకున్నట్టుగా ఈ షార్ట్-టర్మ్ పాలసీలను రెన్యువల్ చేసుకోలేం.

**చివరగా..**

షార్ట్-టర్మ్ హెల్త్ ఇన్సూరెన్స్‌లు తక్షణ అవసరాలకే పనికొస్తాయి. కాబట్టి లాంగ్-టర్మ్ హెల్త్ ఇన్సూరెన్స్‌లకే ప్రాధాన్యం ఇవ్వాలి. అప్పుడే దీర్ఘకాలిక ఆరోగ్య ప్రయోజనాలను పొందుతాం. ప్రీమియంలు ఎక్కువైనప్పటికీ క్లెయిములు లేకపోతే కవరేజీలు పెరిగే ప్రయోజనం ఉంటుంది. మెటర్నిటీ, మెంటల్ హెల్త్ తదితర అవసరాలు, సమస్యలకూ స్టాండర్డ్ హెల్త్ ఇన్సూరెన్స్‌లే లాభదాయకం అని స్పష్టంగా చెప్పవచ్చు. అందుకే సమగ్ర ప్యాకేజీని తీసుకోవడం మరువద్దు.

# రాబడి

మార్కెట్ పల్స్

# ఫెడ్ నిర్ణయమే కీలకం..

**దేశీయ** స్టాక్ మార్కెట్లు లాభాల జోష్‌లో సాగుతున్నాయి. మదుపరులు పెట్టుబడులకు మద్దతు పలుకుతున్నారు. గత వారం ట్రేడింగ్‌లో గురువారం ఒక్కరోజే సెన్సెక్స్ 1,440, నిఫ్టీ 470 పాయింట్లు పెరిగాయి. ఈ క్రమంలోనే వారం మొత్తంగా సూచీలు భారీ ఎత్తున పుంజుకోగలిగాయి. అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,707.01 పాయింట్లు ఎగిసి 82,890.94 వద్ద నిలిచింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం 504.35 పాయింట్లు ఎగబాకి 25,356.50 దగ్గర ముగిసింది. మునుపెన్నడూ లేనివిధంగా సెన్సెక్స్ తొలిసారి 83వేల మార్కును అధిగమించింది. నిఫ్టీ సైతం నూతన గరిష్ఠాలను తాకింది. ఈ నేపథ్యంలో ఈ వారం అమ్మకాల ఒత్తిడికి ఆస్కారం కనిపిస్తున్నది. శుక్రవారమే మార్కెట్లలో సెల్లింగ్ ప్రెషర్ ఉండటాన్ని గమనించవచ్చు. పారిశ్రామికోత్పత్తి మందగించడం, ద్రవ్యోల్బణం మళ్లీ విజృంభిస్తున్న సంకేతాలు రావడంతో ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు బ్రేక్ వేయవచ్చన్న అభిప్రాయాలను మెజారిటీ నిపుణులు వ్యక్తం చేస్తున్నారు. పైగా సూచీలు ఆల్‌టైమ్ హైల్లో ఉండటం కూడా లాభాల స్వీకరణకు తావిస్తోందంటున్నారు. ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ ద్రవ్య సమీక్ష ప్రభావం కూడా కనిపించనున్నది. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 24,900 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,700 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 25,700-25,900 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

**చివరగా..**

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఏ బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.

# యూబీఐ ప్రత్యేక డిపాజిట్ స్కీం

**ప్రభుత్వ** రంగ సంస్థ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిపాజిట్లను ఆకట్టుకోవడానికి ప్రత్యేక డిపాజిట్ స్కీంను మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. 333 రోజుల కాలపరిమితితో యూనియన్ సమృద్ధి స్కీంపై అధిక వడ్డీ రేటును ఆఫర్ చేస్తున్నది బ్యాంక్. ఈ స్కీంలో కనీసంగా రూ.1,000 నుంచి రూ.3 కోట్ల లోపు డిపాజిట్ చేయవచ్చును. ఈ స్కీంపై సాధారణ ప్రజలకు 7.40 శాతం వార్షిక వడ్డీని చెల్లిస్తున్న బ్యాంక్..సీనియర్ సిటిజన్లకు 7.90 శాతం, సూపర్ సీనియర్ సిటిజన్లకు 8.15 శాతం వడ్డీని ఆఫర్ చేస్తున్నది బ్యాంక్. మెచ్యూర్ కాకముందే ఈ డిపాజిట్లను విత్‌డ్రా చేసుకునే అవకాశాన్ని బ్యాంక్ కల్పించింది. కానీ, ఇలా చేసుకుంటే ఒక్క శాతం వడ్డీని తగ్గి చెల్లించనున్నది. ఈ డిపాజిట్ స్కీంను ఎంచుకోవడానికి బ్యాంక్ శాఖ లేదా వెబ్‌సైట్ ద్వారా డిపాజిట్ చేయవచ్చును.